క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలని ఉద్యోగుల ధర్నా



ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ డిపోలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఏపీఎస్ ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం డిపో ఆవరణలో ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ డిపోలో నెలకొన్న సమస్యలను డీఎం దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా ఫలితం లేదని చెప్పారు. ఉద్యోగులకు సకాలంలో అలవెన్సులు అందజేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని డిపో మేనేజర్ సుబ్రహ్మణ్యంకు అందజేశారు. కార్యక్రమంలో డిపో సీసీఎస్ సభ్యులు అనంత రాములు, పాలకవర్గ సభ్యులు శ్రీనివాసరావు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నూతన బస్సులు ప్రారంభం



తిరువూరు: తిరువూరు ఆర్టీసీ డిపో నుంచి ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు ఏర్పాటు చేసిన నూతన బస్సులను ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. తిరువూరు నుంచి హైదరాబాద్‌లోని మియాపూర్‌కు, విజయవాడ, గోసవీడులకు నూతన బస్సులను స్థానిక బస్టాండ్ ఆవరణలో ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్టీసీ డిపో మేనేజరు వేణు, సిబ్బంది పాల్గొన్నారు. బెంగుళూరు, విశాఖపట్నం, నాగాయలంక, గంగావతి, ద్వారకా తిరుమల, శ్రీశైలం బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని పలువురు ప్రయాణికులు, ఆర్టీసీ కార్మికులు కోరారు.

నేడు అమ్మవారికి ఆషాఢ సారె

విస్సన్నపేట: పుట్రేల గ్రామంలోని మారెమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం నాయకులు మంగళవారం తెలిపారు. ఆర్య వైశ్యులు కార్యక్రమంలో పాల్గొనాలని నాయకులు కోరారు.

విద్యార్థినులకు దుస్తుల పంపిణీ

తిరువూరు: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పలువురు విద్యార్థినులకు ఎమ్మెల్యే వీటిని అందజేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను ఈ సందర్భంగా ఎమ్మెల్యే వివరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

గౌరీకేదారేశ్వరాలయంలో సారె సమర్పణ



తిరువూరు: తిరువూరు వాసవీ క్లబ్, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో మంగళవారం శ్రీగౌరీ కేదారేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి సారె సమర్పించారు. క్లబ్ సభ్యులు ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు నాళ్ల శ్రీనివాసరావు, రాయల నాగచంద్రకళ, సభ్యులు కొత్తగుండ్ల ప్రసాదరావు, నాళ్ల రామారావు, సుధాకర్, వెంకట రమణ, నాళ్ల సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

వార్డుల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు

తిరువూరు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పలు వార్డుల్లో విష జ్వరాలు ప్రబలుతుండటంతో నగర పంచాయతీ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. మురుగుకాలువలు శుభ్రం చేయడంతో పాటు దోమలు ప్రబలకుండా ఎబేట్ మందు పిచికారీ చేశారు. మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లి పరిసరాల పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారి రేష్మా బేగం, ఆరోగ్య కార్యదర్శులు పర్యవేక్షించారు.

గ్రామాల్లో పెరుగుతున్న విష జ్వరాలు

- లోపించిన పారిశుధ్యం
- మొక్కుబడిగా పారిశుధ్య పనులు
- ప్రభుత్వాస్పత్రిలో పెరుగుతున్న రోగుల సంఖ్య



మైలవరం ప్రభుత్వాస్పత్రిలో జ్వరాలతో చికిత్స పొందుతున్న రోగులు



వైద్యశిబిరంలో సిబ్బందికి సూచనలిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని

మైలవరం: మైలవరం మండలంలోని గ్రామాల్లో విష జ్వరాలు పెరుగుతున్నాయి. మైలవరంలో పారిశుధ్యం లోపించింది. మొక్కుబడిగా డ్రెయినేజీలు శుభ్రం చేయిస్తున్నారే తప్ప సున్నం గానీ, బ్లీచింగ్ కానీ చల్లించడంలేదు. దీనితో దోమల లార్వాలు పెరిగి జ్వరాలు ప్రబలుతున్నాయి. స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని బెడ్‌లు ఇప్పటికే భర్తీ అయ్యాయి. మైలవరం ప్రభుత్వ ఆస్పత్రికి ప్రతి రోజూ సుమారు 200 మంది రోగులు వైద్య పరీక్షలు చేయించుకునేందుకు వస్తుంటారు. కానీ ప్రభుత్వ ఆస్పత్రిలో మందుల కొరత వేధిస్తోంది. గతంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ నెలకు ఒకటి, రెండు సమావేశాలు నిర్వహించి ఆస్పత్రిలోని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లేవారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో అధికారులు గానీ ప్రజా ప్రతినిధులు గాని దీనిపై దృష్టి పెట్టకపోవడంతో సమస్యలు పేరుకుపోతున్నాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధికి నూతన భవనాన్ని నిర్మించారు. ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత వేధిస్తోంది. దీనిపై ఆస్పత్రి సూపరింటెండెంట్ జయప్రకాశ్‌ను వివరణ కోరగా మైలవరంలో జ్వరాలు పెరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం జ్వరంతో 20 మంది వరకు చికిత్స పొందుతున్నారని చెప్పారు. ఓపీకి వచ్చే వారిలో మూడో వంతు జ్వరపీడితులేనని వివరించారు.

విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

వెల్వడం(మైలవరం): గ్రామాల్లో పెరుగుతున్న విష జ్వరాలపై ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం. సుహాసిని అన్నారు. మైలవరం మండలం చంద్రాల గ్రామం పీహెచ్‌సీ పరిధిలోని వెల్వడం గ్రామంలో వైరల్ ఫీవర్ కేసులు నమోదైన దృష్ట్యా గ్రామంలోని కచేరీ చావడిలో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె మంగళవారం పరిశీలించి మాట్లాడారు. 8 వైద్య బృందాలు, 257 ఇంటింటి సర్వే ద్వారా 1,872 మందిని ఆశా వర్కర్స్ సర్వే చేశారన్నారు. సీహెచ్‌ఓలు, ఏఎన్ఎంలు, ఆశాలు ఫీవర్ సర్వే చేస్తుండగా గ్రామంలో లార్వాను గుర్తించారని చెప్పారు. గ్రామంలో బ్లీచింగ్ చల్లించారు. లార్వా సైడ్ స్ప్రేయింగ్, ఫాగింగ్ కార్యక్రమం పంచాయతీ సిబ్బంది చేపట్టారు. అలాగే మైలవరం మండలంలోని 16 ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని డీఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని తెలిపారు. జ్వర బాధితులకు రక్త పరీక్షలు చేస్తున్నామని చెప్పారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి గ్రామస్తులను అప్రమత్తం చేస్తున్నామన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సునీల్, డాక్టర్ అరుణ, సబ్ యూనిట్ అధికారులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, పర్యవేక్షకులు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నూజివీడు: ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలోని డీఎం కార్యాలయంలో బుధవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తామని డిపో మేనేజర్ సీహెచ్ సూర్యపవన్ కుమార్ మంగళవారం తెలిపారు. ఆర్టీసీ బస్సు సర్వీసులు, సదుపాయాలు, సౌకర్యాలు, సమస్యలపై ప్రయాణికులు ఫోన్ చేసి తమ సమస్యలను తెలపాలన్నారు. సందేహాలు, సలహాలను సెల్: 99592 25461 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

దోమల నివారణకు ప్రత్యేక కార్యాచరణ

చాట్రాయి: దోమల నివారణకు ప్రత్యేక కార్యాచరణను రూపొందించామని పీహెచ్‌సీ వైద్యాధికారి విజయలక్ష్మి అన్నారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆరుబయట దోమలను నివారిస్తేనే జ్వరాలు తగ్గుముఖం పడతాయన్నారు. షెడ్యూల్ ప్రకారం మండలంలోని చనుబండ, నరసింహారావుపాలెం, చిన్నంపేట, కోటపాడు, చీపురుగూడెం, చాట్రాయి గ్రామాల్లో దోమల నివారణ చర్యలు చేపట్టనున్నామని చెప్పారు. డ్రెయినేజీలు, మురుగునీటిలో ఎబెట్ ద్రావణాన్ని పిచికారీ చేస్తామని, ఇంటి లోపల సైఫెనోత్రిన్ ద్రావణాన్ని పిచికారీ చేస్తామని చెప్పారు. దీంతో దోమలను చాలా వరకు నిర్మూలించవచ్చునని, ప్రజలు కూడా తమ పరిసరాల్లో పరిశుభ్రతను పాటించాలని ఆమె సూచించారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి మోతీలాల్ నాయక్



వికాస్ బీఈడీ కళాశాలలో మాట్లాడుతున్న ఏసీపీ మురళీమోహన్

తిరువూరు: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని తిరువూరు మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి మోతీలాల్ నాయక్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాల నిర్మూలన, మానవ అక్రమ రవాణాపై అవగాహన సదస్సు నిర్వహించారు. మాదక ద్రవ్యాలకు బానిసలైన యువతీ, యువకుల భవిష్యత్ అంధకారమవుతుందని జడ్జి పేర్కొన్నారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎ.సిందూర, ఏపీపీ బడేమియా, ఏజీపీ రాము, బార్ అసోసియేషన్ చైర్మన్ వాకదాని లక్ష్మీనారాయణ, న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు మేకల నాగేంద్రప్రసాద్, పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు

విస్సన్నపేట: మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు అవుతాయని, యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఏసీపీ మురళీమోహన్ అన్నారు. స్థానిక వికాస్ బీఈడీ క్యాంపస్‌లో డ్రగ్స్ వలన కలిగే అనర్థాలు, సైబర్ నేరాలపై విద్యార్థులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొంతమంది యువత ముందుగా సిగరెట్‌తో ప్రారంభించి గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలై డబ్బులేక దొంగతనాలకు పాల్పడి భంగారు భవిష్యత్‌ను పాడుచేసుకుంటున్నారని చెప్పారు. తల్లిదండ్రులు ఎంత కష్టపడి పిల్లల్ని చదివిస్తున్నారో ప్రతి ఒక్కరు ఆలోచించి మంచి లక్ష్యంతో చదివి ఉన్నతులుగా ఎదగాలని సూచించారు. సెల్‌ఫోన్ల వినియోగం పెరగటంతో సైబర్ నేరాలు చేసే వారి సంఖ్య అధికమైందని, ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, లోన్ యాప్‌లకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ అబ్దుల్‌నబీ, ఎస్ఐ రామకృష్ణ, వికాస్ విద్యా సంస్థల చైర్మన్ నరెడ్ల నర్సిరెడ్డి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

జి. కొండూరు: ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని డాక్టర్ మణిబాబు అన్నారు. మద్దుల పర్వ, కూనపరాజుపర్వ గ్రామాల్లో మంగళవారం వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. కూనపరాజు పర్వ, మద్దులపర్వ గ్రామాల్లో జ్వరం, ఒళ్లునొప్పులు, కాళ్లవాపులతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. డాక్టర్ మణిబాబు మాట్లాడుతూ ఇంటి పరిసరాలతో పాటు ఇంట్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, దోమ తెరలు వాడాలని, వేడి వేడి ఆహార ప్రదార్థాలు తీసుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. కార్యక్రమాలలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ముత్తు లక్ష్మీరెడ్డికి నివాళి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రముఖ సంఘ సంస్కర్త, మద్రాస్ శాసన మండలి మొదటి సభ్యురాలు ముత్తు లక్ష్మీరెడ్డి జయంతి కార్యక్రమం కొండపల్లి జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ప్రముఖ వైద్యులు మామిడి సీతారామారావు, జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు పి.కామేశ్వరరావు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ విద్యావేత్తగా స్త్రీల హక్కుల కోసం పోరాటం చేసి దేవదాసి వ్యవస్థ నిర్మూలనకు ముత్తు లక్ష్మీరెడ్డి కృషి చేశారని వివరించారు. డాక్టర్‌గా 1954లో అడయార్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ స్థాపించారని చెప్పారు. ఆమె సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం 1956లో పద్మవిభూషణ్ అవార్డుతో గౌరవించిందని తెలిపారు. జేవీవీ నాయకులు ఎస్. నాగరాజు, సర్దార్ సాహెబ్ పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై అప్రమత్తంగా ఉండాలి

ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి వి. వెంకటేశ్వరరావు

నూజివీడు: మానవ అక్రమ రవాణాపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఒకటో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి. వెంకటేశ్వరరావు అన్నారు. ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన బాలికల కాలేజీ హాస్టల్‌లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా ముఖ్య ధ్యేయం డబ్బు సంపాదనేనని అన్నారు. కొందరు వ్యక్తులు యువతులకు, బాలికలకు మాయమాటలు చెప్పి మభ్యపెట్టి తీసుకెళ్లి అమ్మేస్తుంటారన్నారు. ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా ప్రభావం వల్ల అనేక అనర్థాలు చోటుచేసుకుంటున్నాయని చెప్పారు. తల్లిదండ్రులు పిల్లల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. బాలికలు, మహిళలు, యువతులు ప్రలోభాలకు లోనుకావద్దని చెప్పారు. చక్కగా చదువుకొని జీవితంలో ఉన్నత స్థానానికి ఎదగడానికి కృషి చేయాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్ మాట్లాడుతూ చదువుకునే పిల్లలు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలన్నారు. ఐసీడీఎస్ సీడీ పీఓ ఎస్వై నూరాని, న్యాయవాదులు మడుపల్లి మధుర విశంకర్, బసవరాజు రామకృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధి నిధులతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం

ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్

జి.కొండూరు: మండల పరిధిలోని పలు అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, సమస్యల సత్వర పరిష్కారానికి ప్రభుత్వం నుంచి రూ.5 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే వసంత వెంకటకృష్ణప్రసాద్ తెలిపారు. స్థానిక కమ్యూనిటీహాల్‌లో కూటమి నేతలతో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విడుదలైన నిధులను ముఖ్యంగా సీసీరోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలకు వినియోగించాలన్నారు. మండల పరిధిలో చెవుటూరు, కట్టుబడిపాలెం, మునగపాడు, కోడూరు, వెంకటాపురం, తెల్లదేవరపాడు, గుర్రాజుపాలెం గ్రామాలలో ఇళ్ల స్థలాల సమస్య ఉన్నందున త్వరలో ఆ సమస్యను పరిష్కరిస్తామన్నారు. జి.కొండూరు నుంచి దుగ్గిరాలపాడు, కందులపాడు నుంచి నాగులూరు వరకు ఉన్న రహదారి సమస్యను సైతం త్వరలో పరిష్కరించేందుకు చర్యలు చేపడతానని వివరించారు. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండలానికి రూ.5 కోట్లు మంజూరు..

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇబ్రహీంపట్నం మండలానికి రూ.5 కోట్లు మంజూరయ్యాయని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. ఈ నిధులతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు వంటి మౌలిక వసతులను కల్పిస్తామన్నారు. మంగళవారం ఆయన గొల్లపూడిలోని తన కార్యాలయంలో ఇబ్రహీంపట్నం మండలానికి చెందిన కూటమి నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

దివ్యాంగులకు విద్యా పరికరాలు అందజేత



దివ్యాంగులకు విద్యా పరికరాలు అందిస్తున్న సిస్టర్ అలెక్స్, పాస్టర్ సురేష్‌బాబు తదితరులు

ఇబ్రహీంపట్నం: ప్రత్యేక అవసరాలు కలిగిన దివ్యాంగులకు సమాజంలో ప్రత్యేక స్థానం కల్పించాలని సిస్టర్ అలెక్స్ (అమెరికా దేశ ఉపాధ్యాయిని) అన్నారు. దివ్యాంగులకు భవిత కేంద్రాలు అండగా నిలవడం అభినందనీయమని చెప్పారు. కేతనకొండ సీయోను మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్, జామెంట్రీ బాక్స్ తదితర విద్యా పరికరాలను, తినుబండారాలను మంగళవారం అందజేసి ఆమె మాట్లాడారు. విద్యతో దివ్యాంగుల జీవితాల్లో వెలుగులు నింపవచ్చన్నారు. సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు మాట్లాడుతూ క్రమశిక్షణ, నైతిక విలువలతో కూడిన విద్య అందించాలన్నారు. భవితకేంద్రం పెయింటింగ్ కోసం ఆర్థిక సహాయం అందించారు. పాస్టర్ మోగులూరి సుశేశ్వరరావు, బ్యూలా, రాజేష్, పాపారావు, సువర్ణరావు పాల్గొన్నారు.

ఎన్‌టీఏ రద్దు చేయాలని విద్యార్థుల ఆందోళన



ఐసా ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

నూజివీడు: నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)ని తక్షణమే కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని ఆలిండియా స్టూడెంట్ అసోసియేషన్ (ఐసా) ఏలూరు జిల్లా కార్యదర్శి గరికే అఖిల్ డిమాండ్ చేశారు. ఎన్‌టీఏను రద్దు చేసి నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఐసా ఆధ్వర్యంలో నూజివీడు పట్టణంలో మంగళవారం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిల్ మాట్లాడుతూ ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నిర్బంధంగా నూతన జాతీయ విద్యా విధానం తీసుకొచ్చి అందులో భాగంగా ఉమ్మడి ప్రవేశ పరీక్షలు ప్రవేశపెట్టిందన్నారు. దేశవ్యాప్తంగా అనేక పరీక్షలను నిర్వహించడంలో ఎన్‌టీఏ ఘోరంగా విఫలమైందని ధ్వజమెత్తారు. దీనివల్ల ప్రతిభ కలిగిన విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వీటన్నింటికి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేయాలన్నారు. ఉమ్మడి ప్రవేశ పరీక్షలను నిర్వహించడాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు వెంకట్, కార్యదర్శి రియాజ్, నాయకులు సాయి, ధర్మేంద్ర తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య

గంపలగూడెం: మండలంలోని ఊటుకూరులో మంగళవారం మద్యం మత్తులో ఒక యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. మడిపల్లి చంటి (28) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తాగుడుకు బానిసైన చంటి తరచూ ఇంట్లో గొడవ పడుతూ డబ్బులు ఇవ్వాలని భార్యను వేధిస్తున్నాడు. డబ్బులు ఇవ్వట్లేదన్న కోపంతో చంటి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీను తెలిపారు. మృతుడి భార్య మౌనిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతుడికి ఇద్దరు సంతానం.

సమస్యలు పరిష్కరించాలని వినతి



తిరువూరురూరల్: కోకిలంపాడులో డ్రెయినేజీలు లేక మురుగునీరు, వర్షం నీరు రోడ్లపై పారుతోందని గ్రామస్తులు తిరువూరు ఆర్డీఓ మాధవికి మంగళవారం ఫిర్యాదు చేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ తిరువూరు–అడసర్లపాడు ఆర్ అండ్ బీ రహదారిపై కోకిలంపాడు గ్రామ పరిధిలో నీరు నిలిచి గోతులమయంగా మారుతోందన్నారు. మురుగునీరు, వర్షం నీరు చేరి దుర్గంధం వెదజల్లుతోందని చెప్పారు. బీసీ కాలనీలో తాగునీటి సరఫరా లేక ఇబ్బంది పడుతున్నామని, సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు.

తహసీల్దార్లకు సిబ్బంది ఘన సన్మానం



తహసీల్దార్ మృత్యుంజయరావును సన్మానిస్తున్న సిబ్బంది



తహసీల్దార్ జవహర్ బాజీని సన్మానిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి తహసీల్దార్ మృత్యుంజయరావు అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డీటీ పవన్‌కుమార్ వ్యవహరించనున్నారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న తహసీల్దార్ మృత్యుంజయరావును మంగళవారం రెవెన్యూ అధికారులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్ఐలు నవీన్‌కుమార్, లక్ష్మీ నాంచారమ్మ, సీనియర్ అసిస్టెంట్ యోనాస్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ముసునూరు తహసీల్దార్ జవహర్ బాజీకి సన్మానం

ముసునూరు: సమర్థవంతంగా పని చేసిన ఉద్యోగులకు గుర్తింపు ఉంటుందని ఎంపీడీఓ చాగంటి పద్మావతీ దేవి అన్నారు. ముసునూరు తహసీల్దార్‌గా పనిచేసిన జీఎస్ఎస్ జవహర్ బాజీ మంగళవారం మండలం నుంచి రిలీవ్ అయ్యి రాజమండ్రిలో రిపోర్టు చేయనున్నారు. ఈ సందర్భంగా డీటీ ఎమిలీ కుమారి అధ్యక్షతన ఆర్ఐ దీపిక, వీఆర్వోలు మస్తాన్‌రావు, నవీన్, హరిబాబు, రెవెన్యూ ఉద్యోగులు, రేషన్ డీలర్ల సంఘ సభ్యులు, కార్యాలయ సిబ్బంది జవహర్‌ను ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు.

పింఛన్లను వేగవంతంగా పంపిణీ చేయాలి

చాట్రాయి: మండలంలోని అన్ని గ్రామాల్లో పింఛన్లను వేగవంతంగా లబ్ధిదారులకు అందజేయాలని ఎంపీడీఓ మంగాకుమారి అన్నారు. పింఛన్ల పంపిణీపై మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందితో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. గురువారం ఉదయం 5 గంటల కల్లా పింఛన్ల పంపిణీ ప్రారంభించి సాయంత్రంలోగా నూరు శాతం పూర్తి చేయాలని చెప్పారు. గ్రామంలో లేని లబ్ధిదారులను గుర్తించి ముందుగానే వారికి సమాచారం అందించాలని ఆమె సూచించారు.

పెన్షనర్లు అందుబాటులో ఉండాలి

తిరువూరు: ఆగస్టు ఒకటిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ జరుగనున్నందున పెన్షన్‌దారులు అందుబాటులో ఉండాలని తిరువూరు నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు అన్నారు. ఉదయం 6 గంటల నుంచి వార్డు సచివాలయ సిబ్బంది ఇంటింటికీ వచ్చి పెన్షన్ సొమ్ము అందజేస్తారని చెప్పారు. ఇళ్ల వద్దే లబ్ధిదారులు ఉండాలని కోరారు.

- **ముసునూరు:** ఆగస్టు నెలకు సంబంధించిన పింఛన్ల నగదు విడుదలైందని ఎంపీడీఓ పద్మావతీదేవి తెలిపారు. మంగళవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఆగస్టు 2024కు సంబంధించి, 7,973 మంది పింఛన్‌దారులకు రూ.3,34,19,000 నగదు విడుదలైందని చెప్పారు. పింఛన్లను ఒకటవ తేదీ ఉదయం ఆరు గంటల నుంచి పంపిణీ చేస్తారన్నారు.

జీఓ నంబర్ 117 రద్దు చేయాలి

యూటీఎఫ్ డిమాండ్

మైలవరం: ప్రాథమిక విద్యకు శరాఘాతంగా మారిన జీఓ నంబర్ 117ను తక్షమే రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కె. గంగరాజు డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలపై రాష్ట్ర సంఘం పిలుపు మేరకు మైలవరం ఎంఈఓ ఎల్. బాలు, తహసీల్దార్ టీఆర్ రాజశేఖరరావుకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని యూనియన్ నాయకులు శనివారం అందజేశారు. గంగరాజు మాట్లాడుతూ ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఒకే పాఠశాలలో కొనసాగించాలని, ఉన్నత పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం పదో తరగతి విద్యార్థులకు తెలుగు, ఆంగ్ల మాధ్యమాలలో పరీక్షలు నిర్వహించాలని, పాఠశాలలకు రావాల్సిన అన్ని గ్రాంట్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మైలవరం మండల అధ్యక్షుడు మల్లాది తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి వసంతరావు వాడపల్లి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్ బహూకరణ

చాట్రాయి: మండలంలోని పోలవరం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్. నాగేశ్వరరావు స్థానిక అంగన్‌వాడీ కేంద్రానికి సీలింగ్ ఫ్యాన్ బహూకరించారు. చిన్నారుల కోరిక మేరకు కేంద్రానికి ఈ ఫ్యాన్ అందించామని దాత నాగేశ్వరరావు తెలిపారు.

మద్యం తరలిస్తున్న కారు స్వాధీనం

ఇబ్రహీంపట్నం: అక్రమంగా మద్యం తరలిస్తున్న కారును ఇబ్రహీంపట్నం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఎం.సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఎస్ఐ పాపారావు మంగళవారం తెల్లవారుజామున రింగ్ సెంటర్‌లో వాహనాలు తనిఖీ చేశారు. ఈక్రమంలో హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న కారులో తొమ్మిది మద్యం బాటిళ్లను గుర్తించారు. అక్రమ మద్యం రవాణా కింద మెదక్ జిల్లాకు చెందిన యాదగిరి, యల్లాగౌడ్, మాలావత్ కెష్య, దుంపల రాములును అదుపులోకి తీసుకున్నారు. మద్యం తరలిస్తున్న కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.